
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 14 । మార్చి । 2025



రూ.1,00,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి బొలిశెట్టి శివ శంకర సూర్యప్రకాశరావు (కాకినాడ) గురువారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



సాగుకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,950, మధ్య డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సాయంత్రం)	సహర్ శనివారం (ఉదయం)
రాజమండ్రి	6.21	4.50
కాకినాడ	6.21	4.50
అమలాపురం	6.21	4.50

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 892 మంది గైర్హాజరు

అమలాపురం టౌన్: జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జనరల్, ఒకేషనల్ పరీక్షలు గురువారం జరిగాయి. ఆయా పరీక్షలకు మొత్తం 892 మంది గైర్హాజరయ్యారు. జనరల్ పరీక్షలకు మొత్తం 11,722 మందికి 11,263 మంది విద్యార్థులు హాజరై, పరీక్షలు రాశారు. 459 మంది పరీక్షలకు హాజరు కాలేదు. అలాగే ఒకేషనల్‌లో 2,458 మందికి 2,025 మంది హాజరయ్యారు. మొత్తం 433 మంది గైర్హాజరయ్యారు. డీఐఈవో వనుము సోమశేఖరరావు అమలాపురంలోని ఎస్‌కేబీఆర్, ఆదిత్య, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం



శ్రీనివాసరావు, జిల్లా ప్రజా రవాణాధికారి

అమలాపురం రూరల్: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు బస్సు పాస్ లేకపోయినా, వారి హాల్ టికెట్ ఆధారంగా జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు ఉచిత ప్రయాణం చేయవచ్చని వివరించారు. కోనసీమ జిల్లా పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కూటమి తీరుపై ఇది జనం తిరుగుబాటు

- ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందే..
- మాజీ ఎంపీ చింతా అనురాధ



అల్లవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడవక మునుపే పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమైందని మాజీ ఎంపీ చింతా అనురాధ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పేదల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం రద్దు చేస్తూ, లబ్ధిదారులు, విద్యార్థులు, యువత భవిష్యత్తును నాశనం చేస్తోందన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్ల బకాయిలను తక్షణం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ నిరుద్యోగులకు ప్రకటించిన నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే, చంద్రబాబు ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించి, వైద్య విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. యువతకు, విద్యార్థులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన యువత పోరు కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామని, ఇది సర్కార్‌పై తిరుగుబాటని తెలిపారు. యువత పోరును విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

15న జెడ్పీ సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, బడ్జెట్ సమావేశం ఈ నెల 15న నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

భావనారాయణ స్వామికి రూ.8.53 లక్షల ఆదాయం




హుండీల ఆదాయం లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. సీఎఫ్ఓ గ్రేడ్-1 ఈఓ వీరభద్రరావు పర్యవేక్షణలో గ్రామస్తులు, అర్చకులు, సిబ్బంది, సేవాదళ్ కార్యకర్తల సమక్షంలో 10 హుండీలు తెరచి, ఆదాయం లెక్కించారు. మొత్తం రూ.8,52,983 ఆదాయం లభించిందని ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. నగదు రూపంలో రూ.7,53,512, నాణేలుగా రూ.99,471 వచ్చాయన్నారు.

రాజ రాజ పోరు!

- కోనసీమలో ఇక 'రాజు' వర్సెస్ 'రాజ' ఆధిపత్య పోరు
- పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖర్ గెలుపుతో ముమ్మిడివరం నియోజకవర్గంలో మారనున్న రాజకీయం
- ఇప్పటి వరకు ఎమ్మెల్యే బుచ్చిబాబు వన్ మ్యాన్ షో
- షాడో ఎమ్మెల్యేగా తమ్ముడు పృథ్వీ
- ప్రత్యర్థులు ఎదగకుండా రాజకీయం
- గతంలో జెడ్పీ చైర్మన్ కాకుండా పేరాబత్తులకు అడ్డంకి
- మిగిలిన నేతలను సైతం ఎదగనివ్వలేదని విమర్శలు
- ఇప్పుడంతా ఒకే గూటికి..!



రాజకీయం ఎప్పుడూ ఒకేలా ఉండదు. ప్రాణమిత్రులైనా.. కొన్ని సందర్భాల్లో బద్ధ శత్రువులుగా మారుతారు. మళ్లీ వారి మధ్య మిత్రుత్వం చిగురించనూ వచ్చు. కానీ.. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఆది నుంచి రాజు, రాజ మధ్య ఆధిపత్య పోరు ఆరని చిచ్చులా రగులుతూనే ఉంది. పట్టభద్రుల గెలుపు విజయం కన్నా.. ఫలితం వల్ల ముమ్మిడివరం నియోజకవర్గంలో టీడీపీలో మారనున్న రాజకీయంపైనే అందరికీ ఆసక్తి నెలకొంది. ఇప్పటి వరకు సాగిన స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) వన్ మ్యాన్ షోకు.. కొత్తగా ఎమ్మెల్సీ అయిన పేరాబత్తుల రాజశేఖర్ చెక్ పెడతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బుచ్చిబాబుపై అసంతృప్తితో ఉన్న నేతలంతా ఓ గొడుగులోకి వచ్చే ప్రయత్నాలు మొదలు కావడంతో ముమ్మిడివరం టీడీపీలో ముసలం మొదలుకానుంది.

సాక్షి, అమలాపురం: శాసన మండలి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి బలపరిచిన పేరాబత్తుల రాజశేఖర్ ఎట్టకేలకు గెలిచారు. ఈ గెలుపు జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల్లో టీడీపీ క్యాడర్‌లో సంతోషాన్ని ఇచ్చిందేమో కానీ, రాజశేఖర్ సొంత నియోజకవర్గంలో కొంతమంది టీడీపీ నాయకులకు మింగుడుపడడం లేదు. ముమ్మిడివరం ఎమ్మెల్యే బుచ్చిబాబుకు, ఇప్పుడు ఎమ్మెల్సీగా గెలిచిన రాజశేఖర్‌కు మధ్య రాజకీయ విభేదాలు ఆది నుంచీ ఉన్నాయి. ముమ్మిడివరం స్థానం నుంచి పోటీ చేయాలని 2009 ఎన్నికల నుంచి రాజశేఖర్ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. 2009లో దివంగత నడింపల్లి శ్రీనివాసరాజు, తర్వాత 2014, 2019, 2024లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి బుచ్చిబాబు పోటీ చేస్తున్నారు. వీరి మధ్య సీటు కోసం జరిగిన పోరు కాస్తా నియోజకవర్గం క్యాడర్ రెండుగా చీలిపోవడానికి కారణమైంది. తనకు పోటీగా మారిన రాజశేఖర్‌కు అవకాశం రాకుండా చూడడంతో పాటు, నియోజకవర్గంలో తనకు ఎప్పటికైనా పోటీ తప్పదనుకున్న కీలక నాయకుల ప్రాబల్యం లేకుండా చేయడంలో బుచ్చిబాబు ఇప్పటి వరకు సఫలీకృతులవుతూ వచ్చారు. రాజశేఖర్‌తో పాటు, గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు వంటి వారిని ఎదగకుండా చేయడం, వారికి కీలక పదవులు రాకుండా బుచ్చిబాబు అడ్డుకుంటున్నారు. రాష్ట్ర వినియోగదారుల ఫోరం డైరెక్టర్ పదవిని నాగిడి నాగేశ్వరరావుకు ఇచ్చినప్పటికీ, అది తన హోదాకు సరిపడేది కాదనే అసంతృప్తి నెలకొంది. మత్స్యకార వర్గానికి చెందిన తనకు ఎమ్మెల్యే బుచ్చిబాబు జోక్యం వల్లే ఉన్నత పదవులు రాకుండా అడ్డుకుంటున్నారనే అసంతృప్తితో రగిలిపోతున్నారు.

ఇలాఉండగా పేరాబత్తుల రాజశేఖర్ 2014లో జిల్లా పరిషత్ చైర్మన్ రేసులో ఉన్నారు. అప్పటి ఆర్థిక శాఖ మంత్రి, పార్టీ సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు మద్దతు ఉన్నా.. బుచ్చిబాబు అడ్డుకున్నారు. చివరి నిమిషంలో ఈ పదవి చేజారి నామన రాంబాబుకు అవకాశం దక్కింది. దీంతో రాజశేఖర్ రూటు మార్చి లోకేష్ టీమ్‌కు దగ్గరగా మసలుతున్నారు. ఈ సాన్నిహిత్యం కారణంగానే రాజశేఖర్‌కు ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎన్నికల ప్రచార కో-ఆర్డినేటర్‌గా అవకాశం కల్పించారు. ఇప్పుడు శాసన మండలికి పంపించారు. ఎన్నికల్లో సైతం బుచ్చిబాబు కలిసి రాలేదని రాజశేఖర్ వర్గం బహిరంగంగానే ఆరోపిస్తోంది. ఎన్నికల ముందు కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన జనసేన నేత త్సవటపల్లి నాగభూషణంపై కేసు, అరెస్టును ఈ సందర్భంగా వారు చూపిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే ఇదంతా జరిగిందని, దీనివల్ల జనసేన దూరమయ్యే పరిస్థితి కల్పించారని వారు ఆరోపిస్తున్నారు. ఇంతవరకూ అంతర్లీనంగా ఉన్న ఆధిపత్య పోరు ఇద్దరికీ సమాన హోదా రావడంతో రచ్చకెక్కడం ఖాయమని నియోజకవర్గంలో టాక్ నడుస్తోంది.

గుర్రుగా జనసేన

కూటమి పార్టీలో భాగస్వామ్యంగా ఉన్న జనసేన సైతం స్థానిక ఎమ్మెల్యేపై గుర్రుగా ఉన్నారు. నియోజకవర్గ పరిధిలో ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని టీడీపీ కట్టబెట్టనున్నారు. ఈ పదవి ముమ్మిడివరానికి చెందిన తాడి నర్సింహారావు పేరును ఖరారు చేశారు. ఈ నిర్ణయంపై జనసేన క్యాడర్ అసంతృప్తితో ఉన్నారు. గత ఎన్నికల్లో తాము కలిసొచ్చినా, తమ పార్టీకి చెందిన గుద్దటి జమ్మీని నీటి సంఘం అధ్యక్షుడిగా పరిమితం చేశారు. కనీసం డీసీ పదవి కూడా ఇవ్వలేదు. నియోజకవర్గంలో తమకు కనీస మర్యాద ఇవ్వడం లేదని సూటిగా విమర్శిస్తున్నారు.

కాకినాడకే పరిమితం

ఇటీవల కాలంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు కాకినాడకు పరిమితమయ్యారు. ఎక్కువగా అక్కడే ఉంటున్నారు. సొంత గ్రామం ఐ.పోలవరం మండలం మురమళ్ల అయినా, నియోజకవర్గంలో ఉంటోంది తక్కువ. కేవలం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు, పార్టీ కార్యక్రమాలకు మాత్రమే వచ్చి వెళుతున్నారు. అతని వరుసకు సోదరుడు పృథ్వీ నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా చక్రం తిప్పుతున్నారు. అన్నీ తానై వ్యవహరిస్తుండడంపై కూడా పార్టీలో కీలక నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులకు మండిపడుతున్నారు. సొంత మండలం ఐ.పోలవరం మండలంలోనే కాకుండా, తాళ్లరేవు, కాట్రేనికోన, ముమ్మిడివరంలో పాలనాపరమైన జోక్యం, అనధికార ఇసుక ర్యాంపులు, అధికారుల బదిలీలు ఇలా చెప్పుకుంటూపోతే అన్నీ ఎమ్మెల్యే సోదరుని కనుసన్నల్లో జరుగుతుండడంతో మండల స్థాయి నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. కీలక నాయకులతో పాటు, ద్వితీయ శ్రేణి నేతలు సైతం ఎమ్మెల్యేపై అసంతృప్తితో ఉండడంతో, ఎమ్మెల్యే బుచ్చిబాబుకు ముందుముందు రాజకీయంగా గడ్డుకాలం తప్పదన్నట్టుగా పరిణామాలు మారుతున్నాయి.

రామాయణాన్ని తెలుగులో సరళతరం చేసిన మొల్ల

– జాయింట్ కలెక్టర్ నిషాంతి నివాళి



కలెక్టరేట్‌లో మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ నిషాంతి, ఉద్యోగులు

అమలాపురం రూరల్: విజయనగర సామ్రాజ్యానికి చెందిన ప్రముఖ కవులు, ఆస్థాన పండితుల సమక్షంలో, సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని సులభతరంగా తెలుగులోకి అనువదించి కవయిత్రి మొల్ల ప్రశంసలు అందుకున్నారని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి కొనియాడారు. కవయిత్రి మొల్ల జయంత్యుత్సవాల సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో కవయిత్రి మొల్లమాంబ చిత్రపటానికి ఆమె నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ, ప్రముఖ కవయిత్రి ఆత్మకూరి మొల్లమాంబ(మొల్ల) జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని తేనె లొలికే అచ్చ తెలుగులో రచించిన ఖ్యాతి మహా కవయిత్రి మొల్లమాంబకే దక్కుతుందన్నారు. తొలి తెలుగు కవయిత్రిగా చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని మొల్ల పదిలపర్చుకుందన్నారు. రామాయణాన్ని మహా పండితులు అనేక మంది రచించినప్పటికీ, మొల్ల రామాయణానికి విశిష్ట స్థానం ఉందన్నారు. మహా పండితులు సైతం మొల్ల రామాయణాన్ని ప్రామాణికంగా చూపుతుంటారన్నారు. ఎంతో భక్తిభావం, ఆరాధనతో మొల్ల రచించిన రామాయణానికి ప్రత్యేక శైలి ఉందన్నారు. మొల్ల రామాయణం రచించి ఆమె శ్రీకృష్ణదేవరాయలు సన్మానం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజకుమారి, డీఈవో షేక్ సలీం బాషా, దేవదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, ఏఓ కాశీవిశ్వేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ సంచులు

- సూపర్ మార్కెట్లు, రైతు బజార్లలో తప్పనిసరి
- వీటి తయారీకి డ్వాక్రా సంఘాలకు ప్రోత్సాహం
- కలెక్టర్ మహేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: సూపర్ మార్కెట్లు, రైతు బజార్లు వంటి వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లో ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా జూట్ సంచుల వినియోగాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. గురువారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర మూడో శనివారం కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ సంచుల విక్రయదారులను గుర్తించి, విక్రయాలను నిలుపుదల చేయాలని, వాటి స్థానంలో ప్రత్యేకంగా ఎస్‌హెచ్‌జీల ద్వారా జూట్ బ్యాగులు తయారు చేయించి, సూపర్ మార్కెట్లు, రైతు బజార్ల వద్ద విక్రయించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తద్వారా డ్వాక్రా సంఘాలకు ఉపాధి, పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతాయన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగులబెట్టకుండా రీ సైక్లింగ్ చేస్తూ, తిరిగి విక్రయించేలా కార్యాచరణ రూపొందించాలని మున్సిపల్, పంచాయతీ అధికార్లకు సూచించారు. దుకాణాలు, హోటళ్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, వాటి స్థానే ఆరిటాకులు, విస్తరాకులు, పేపర్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని పెంచాలన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల సమన్వయంతో దీనిని సమర్థంగా నిర్వహించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కింద పట్టణాలు, గ్రామాల్లోని వివిధ పారిశ్రామిక సంస్థలు, వాణిజ్య ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపడతారన్నారు డీఈవో షేక్ సలీం బాషా, డీఎంహెచ్ఓ దుర్గారావు దొర, డీసీహెచ్ఎస్ కార్తీక్, డీపీవో శాంతలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, మున్సిపల్ కమిషనర్లు, వీఐపీ నాయుడు, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో పీచు వినియోగంపై అధ్యయనం

డెల్టా ప్రాంతమైన కోనసీమ జిల్లాలో గోదావరి వరద కట్టలు, రోడ్లు, డ్రైన్లు, పంట కాలువల గట్ల పటిష్టతకు దీర్ఘకాలిక మన్నిక పెంచేందుకు కొబ్బరి పీచు, జియో టెక్స్‌టైల్స్ మ్యాట్ల వినియోగం సాధ్యాసాధ్యాలపై పూర్తి స్థాయి అధ్యయనం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ విభాగాల ఇంజినీర్లకు క్వాయర్ పరిశ్రమల కేంద్రం ప్రతినిధి త్రిమూర్తులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్ల నిర్మాణంలో పటిష్టతకు శాస్త్రీయపరంగా లేయర్ల నిర్మాణం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే ఆర్థిక సంవత్సరంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నట్టు, ఇది విజయవంతమైతే జిల్లా అంతటా ఈ సాంకేతికతను జోడించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. డ్రైనేజీ విభాగం ఈఈ ఎంపీవీ కిషోర్, జల వనరుల శాఖ ఈఈ బి.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఈఈ బి.రాము, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, డీఈఈ అన్యం రాంబాబు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పీకేపీ ప్రసాద్ పాల్గొన్నారు.

పటిష్టంగా పది పరీక్షల నిర్వహణ

– జాయింట్ కలెక్టర్ నిషాంతి




సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: జిల్లాలో ఈ నెల 17 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. గురువారం పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఆమె సమీక్షించారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరూ మొబైల్ ఫోన్‌ను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో సెక్షన్-144 విధించాలని చెప్పారు. జిరాక్సు, నెట్ సెంటర్లు మూసి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. వైద్య శిబిరాలు, సామగ్రి అందుబాటులో ఉంచాలన్నారు. ప్రశ్నా, జవాబుపత్రాల తరలింపులో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి, పరీక్షా కేంద్రాల రూట్లలో సర్వీసులు నడపాలని ఆదేశించారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించామన్నారు. సమస్యాత్మకమైన పసలపూడి, మొగలికుదురు, కొత్తపేట పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 19,217 మంది విద్యార్థులకు 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డీఈవో షేక్ సలీం బాషా, పరీక్షల కంట్రోలింగ్ అధికారి హనుమంతరావు, డీఆర్‌ఓ రాజకుమారి, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సర్వ సన్నద్ధం

ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం సేకరణకు సర్వ సన్నద్ధం కావాలని జేసీ నిషాంతి అధికారులను ఆదేశించారు. అమరావతి నుంచి రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ సౌరబ్ గౌర్, మేనేజింగ్ డైరెక్టర్ జిలానీ వివిధ జిల్లాల జేసీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆ 'పప్పే'లేం ఉడకవు



- కందిపప్పు సరఫరాలో కూటమి సర్కారుది ఆరంభ శూరత్వం
- రేషన్ దుకాణాల్లో పూర్తిగా నిలిపివేత
- మూడు నెలల నుంచి బియ్యం, పంచదారతోనే సరి!
- ఉగాదికీ పప్పన్నం పెట్టలేని పాలకులు

ఆలమూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. నిత్యావసరాలను రాయితీపై అందిస్తామంటూ నేటి పాలకులు గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. ప్రజలందరూ నిజమేనని నమ్మారు కూడా. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి తొమ్మిది నెలలైనా, ఇంకా అనేక పథకాలు ఆచరణకు నోచుకోలేదు. అమలులో ఉన్న పథకాలూ ఇప్పటికే అర్థంతరంగా నిలిచిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఈ ఏడాది మార్చి నుంచి రేషన్ డిపోల ద్వారా కందిపప్పు సరఫరాను నిలిపివేసి ప్రభుత్వం తన అసమర్థతను చాటుకుంది. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధరల నియంత్రణ కోసం కృషి చేయాల్సిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. రేషన్ దుకాణాల్లో కందిపప్పును కూడా రాయితీపై అందిస్తామన్న హామీనీ అపహాస్యం చేసింది. రేషన్ డిపోల పర్యవేక్షణలో ఎండీయూ వాహనాలు ప్రస్తుతం బియ్యం, పంచదార పంపిణీకే పరిమితమయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగానే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కంది పప్పును కేజీ రూ.67కే ప్రతి నెలా పంపిణీ చేస్తామని గత ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రకటించింది.

ఈ నెలలో నిల్

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో సుమారు 30 శాతం మందికి మాత్రమే సరఫరా చేసినట్టు తెలుస్తోంది. ఎండీయూ వాహనాల్లో ఈ ఏడాది మార్చి నెలలో కందిపప్పు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అలాగే నిత్యావసర సరకుల ధరల నియంత్రణ కోసం సివిల్ సప్లయిస్ శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లు దశలవారీగా మూతపడ్డాయి.

ప్రజలపై తీవ్ర ప్రభావం

రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో ఆ ప్రభావం పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్రంగా పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలను కూటమి ప్రభుత్వం ఏమాత్రం అదుపు చేయలేకపోవడం ప్రజలకు పెనుశాపంగా పరిణమించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాలు, నగర పంచాయతీ, మూడు మున్సిపాలిటీల పరిధిలో 966 రేషన్ డిపోల ద్వారా 355 మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ల(ఎండీయూ)తో 5.48 లక్షల మందికి ప్రతి నెలా రేషన్ సరకులను ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. ప్రతి నెలా 20లోపు సరకుల కోసం రేషన్ డీలర్లు డీడీలు తీసి, అవసరమైన సరకులను దిగుమతి చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. జిల్లా పౌర సరఫరాల శాఖ మాత్రం గతేడాది అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో సక్రమంగానే ఎండీయూ వాహనాల ద్వారా కందిపప్పును సరఫరా చేసింది. జనవరి, ఫిబ్రవరి నెలలకు కందిపప్పు కోసం డీలర్లు డీడీలు తీయగా, 523 టన్నులకు గానూ కేవలం 112 టన్నులే సరఫరా చేసినట్టు డీలర్లు చెబుతున్నారు. డీడీల్లో మిగిలిన సొమ్మును ఇతర సరకులకు సర్దుబాటు చేశారు. దీంతో ఆ రెండు నెలలు కూడా వినియోగదారులకు పూర్తి స్థాయిలో కందిపప్పు సరఫరా జరగలేదు.



ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ సరకులు

పంపిణీకి బ్రేక్..!

రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతో మార్చి నెల నుంచి కందిపప్పు సరఫరా నిలిచిపోయిందని తెలుస్తోంది. ఈ నెలలో కందిపప్పు కోసం డీడీలు తీయవద్దని పౌర సరఫరాల శాఖ అధికారులు ముందుగానే సమాచారం ఇచ్చినట్టు డీలర్లు చెబుతున్నారు. రెండు నెలలుగా పూర్తి స్థాయిలో కందిపప్పు రాకపోవడంతో ఆసరాగా తీసుకున్న కొందరు రేషన్ సరకులను పక్కదారి పట్టించారనే ఆరోపణలూ లేకపోలేదు. బియ్యం, పంచదారతో పాటు, కందిపప్పు కోసం ఎండీయూ వాహనాల ఆపరేటర్లను అడుగుతుంటే, నో స్టాక్ అనే సమాధానం వస్తుందని లబ్ధిదారులు చెబుతున్నారు. రేషన్ దుకాణాల్లో కందిపప్పు సరఫరా నిలిపివేయడంతో బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పును అధికంగా రూ.150 వరకూ కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే కందిపప్పు పంపిణీని పూర్తిగా ఎత్తివేసేలా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

స్టాక్ కోసం ఎదురుచూస్తున్నాం

జిల్లాలో రేషన్‌కార్డుదారులకు ఈ నెల కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. ఈ నెల కేవలం అంగన్‌వాడీ కేంద్రాలకు 18.27 మెట్రిక్ టన్నుల కందిపప్పు మాత్రమే సరఫరా జరిగింది. ప్రస్తుతం జిల్లా గోదాముల్లో కందిపప్పు నిల్వలు అందుబాటులో లేవు. పౌర సరఫరాల శాఖ ఆదేశాల మేరకు కందిపప్పు సరఫరాపై చర్యలు తీసుకుంటాం.

– ఎం.బాలసరస్వతి, జిల్లా మేనేజర్, జిల్లా పౌర సరఫరాల సంస్థ, అమలాపురం

హోలీ వేడుకలపై ప్రత్యేక నిఘా

- ఇతరులకు ఇబ్బంది కలిగించ వద్దు
- రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో రంగులు జల్లవద్దు
- జిల్లా ఎస్పీ కృష్ణారావు



అమలాపురం టౌన్: జిల్లా కంట్రోల్ రూమ్ నుంచి సీసీ టీవీల ద్వారా హోలీ వేడుకలపై ప్రత్యేక నిఘా పెట్టామని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. హోలీ వేడుకలను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇదే సమయంలో ఇతరులకు ఇబ్బంది కలిగేలా లేదా రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఇతరులపై రంగులు జల్లడం వంటి చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. హోలీ పేరుతో హానికర రసాయనాలతో కూడిన రంగులను వాడరాదని చెప్పారు. గీత దాటిన వారిపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు. హోలీ సందర్భంగా ఎక్కడా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. ఆకతాయిలను గుర్తించేందుకు డ్రోన్లను ఉపయోగిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక మొబైల్ పార్టీలు గస్తీ తిరుగుతున్నాయని, ముఖ్య ప్రదేశాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసినట్టు వివరించారు. హోలీ రంగుల వల్ల జిల్లాలో ఎవరైనా ఇబ్బంది పడితే డయల్-112కి కాల్ చేయాలని లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్త కొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,000
గటగట (వెయ్యి)	14,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 - 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
కిలో	260

మట్టి దొంగలెవరయా..?

- చిడిపిలో అక్రమ మట్టి తవ్వకాలు
- వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు
- సమాచారం ఇచ్చినా.. తాపీగా వచ్చిన అధికారులు
- తవ్విన పొక్లెయిన్, లారీలు మాయం
- కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన యంత్రాంగం
- అక్రమార్కులపై కానరాని చర్యలు



కొవ్వూరు మండలం చిడిపి రెవెన్యూ పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు, చిత్రంలో లారీ, పొక్లెయిన్



చిడిపి వద్ద గోదావరి లంక భూముల్లో అక్రమంగా మట్టి తవ్విన ప్రదేశం

కొవ్వూరు: చిడిపి గ్రామంలో గోదావరి లంకలో అక్రమార్కులు మట్టిని కొల్లగొట్టారు. కూటమి నేతల అండదండలతో.. అనధికారికంగా నదీగర్భంలో పొక్లెయిన్లను ఉపయోగించి, లారీల్లో భారీగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో స్థానికులు అక్కడకు వెళ్లి తవ్వకం పనులను అడ్డుకున్నారు. మట్టిని తరలిస్తున్న లారీలను, పొక్లెయిన్లను అడ్డగించారు. అనంతరం అధికారులకు సమాచారం అందించారు. తీరిగ్గా అధికారులు వచ్చే సమయానికి ఆ ప్రదేశంలో లారీలు, పొక్లెయిన్లు మాయమయ్యాయి. అక్రమంగా తవ్వి వదిలేసిన గోతులు మాత్రమే అక్కడ దర్శనమిచ్చాయి.

వాస్తవానికి ఈ భూములను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చిడిపి గ్రామానికి చెందిన 97 మంది పేదలకు పట్టాలుగా పంపిణీ చేశారు. దీంతో గ్రామస్తులు మట్టి తవ్వకం పనులను అడ్డగించి, తహసీల్దార్‌కి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. మట్టి తవ్వకానికి సంబంధించిన ఫొటోలనూ పంపించారు. అధికారులు సావధానంగా ఆ ప్రదేశానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ గ్రామస్తులు అడ్డుకున్న లారీలు, పొక్లెయిన్లు మాయం కావడం చర్చనీయాంశమైంది. దీంతో టాస్క్‌ఫోర్స్ ఎస్సై జి.శ్రీనివాసరావు, వీఆర్వోలు మట్టి తవ్విన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఏ విధమైన వాహనాలు లేనట్టు చెబుతున్నారు. ఫిర్యాదుదారులు అధికారులకు పంపిన ఫొటోల్లో, మీడియాలో ప్రచురితమైన ఫొటోల్లో లారీ నంబర్ స్పష్టంగా కనిపిస్తోంది. అయినప్పటికీ అధికారులు మాత్రం వాహనాలపై చర్యలు తీసుకోవడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ అక్రమ వ్యవహారాన్ని ముందుగా ఫిర్యాదుదారులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. వాటినే అధికారులకూ పంపించారు. తీరా విషయాన్ని సెటిల్మెంట్ చేసుకుని, ఏ విధమైన కేసుల్లేకుండా సహకరించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు అధికారులు సైతం తమ వంతు సహకారం అందించినట్టు సమాచారం.

అక్రమ తవ్వకాలపై చర్యలేవీ?

తాళ్లపూడి మండలం బల్లిపాడు, కొవ్వూరు మండలం చిడిపి గ్రామాల మధ్య రెండు మండలాల సరిహద్దుల్లో ఈ తవ్వకాలు సాగుతున్నాయి. తమ పరిధి కాదంటూ ఒక మండలం అధికారులు మరో మండలం వారిపై నెట్టుకుంటూ, లోపాయికారిగా అక్రమార్కులకు సహకరిస్తున్నట్టు సమాచారం. అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశంలో ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వి, తరలించారన్నదీ లెక్క తేల్చాల్సిన అధికారులు, ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడాన్ని గ్రామస్తులు తప్పుపడుతున్నారు. రెవెన్యూ, టాస్క్‌ఫోర్స్ అధికారులు మట్టి తవ్వకాల ప్రదేశాన్ని పరిశీలించాక.. అసలు ఎవరి వాహనాలు తవ్వాయి, మట్టి తవ్వకాల వెనుక ఎవరున్నారు, ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వారు, దాని విలువెంత, దానిని ఎవరి నుంచి రికవరీ చేయాలన్న అంశాలపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో చేతులు మారినట్టు చర్చించుకుంటున్నారు. కొందరు కూటమి నాయకుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి, ఈ అక్రమ బాగోతాన్ని సర్దుబాటు చేయడంపై జనాలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇటీవల దేచెర్ల గ్రామంలో ఎర్రమట్టి తవ్వకాలపై మీడియాలో కథనాలు వచ్చాయి. ఆ సమయంలో మైనింగ్ అధికారులు ఆగమేఘాలపై వచ్చి, కొలతలు వేసి, అక్రమ తవ్వకాలు ఏ మేరకు సాగాయో నిర్ధారించారు. వాహనాలను సైతం సీజ్ చేశారు. తాజా వ్యవహారంలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం అధికారుల తీరుకు అద్దం పడుతోంది.

మాకు ఫిర్యాదు అందలేదు

మట్టి తవ్వకాలపై మాకు ఏ విధమైన రాతపూర్వక ఫిర్యాదు అందలేదు. మాకు అందిన సమాచారం మేరకు మట్టి తవ్విన ప్రదేశానికి వీఆర్వో సుబ్రహ్మణ్యం, టాస్క్‌ఫోర్స్ ఎస్సై జి.శ్రీనివాసరావును పంపించాం. పని ప్రదేశంలో వాహనాలు ఏమీ లేవు. ముందుగా ఫిర్యాదు చేసిన స్థానికులెవరూ స్టేట్‌మెంట్(వాంగ్మూలం) ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. మైనింగ్ చేసిన ప్రదేశాన్ని టాస్క్‌ఫోర్స్ ఎస్సై, మైనింగ్ అధికారులు పరిశీలించారు. తదుపరి చర్యలు మైనింగ్ అధికారులు తీసుకోవాల్సి ఉంది.

– ఎం.దుర్గాప్రసాద్, తహసీల్దార్, కొవ్వూరు

పొదుపు ఖాతాలో సొమ్ము మాయం

రెండు నెలల్లో దఫదఫాలుగా రూ.2.40 లక్షలు అదృశ్యం



ఏపీఎం వెంకట్‌కు ఫిర్యాదు అందజేస్తున్న గ్రూపు సభ్యులు

ప్రత్తిపాడు: మహిళా శక్తి సంఘం పొదుపు ఖాతా నుంచి యూపీఐ ద్వారా సొమ్ము మాయమైన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్ బ్యాంక్ నుంచి ఈ సొమ్ము మాయమైంది. ఆ గ్రామానికి చెందిన సదా శివ మహిళా శక్తి సంఘం (డ్వాక్రా గ్రూపు) పొదుపు ఖాతాలో జనవరి 14 నుంచి మార్చి 7 మధ్య దఫదఫాలుగా రూ.వెయ్యి నుంచి రూ.46 వేల వరకు 27 లావాదేవీల ద్వారా ఈ సొమ్ము కాజేసినట్టు బ్యాంకు అధికారులు గుర్తించారు. ప్రతి డ్వాక్రా గ్రూపు నుంచి సురక్ష, జీవన జ్యోతి యోజనలకు బ్యాంకు వారే రెన్యువల్ చేస్తారు. ఇందుకు పొదుపు ఖాతాలో కనీసం రూ.2 లక్షలైనా ఉండాలి. బ్యాంక్ మేనేజర్ లలిత్ ఈ పథకాలను రెన్యువల్ చేసేందుకు ఖాతాలను పరిశీలిస్తే, కేవలం రూ.760 ఉన్నాయి. దీంతో ఆయన డ్వాక్రా గ్రూపు సభ్యులకు సమాచారం అందించి, సైబర్ మోసం జరిగినట్టు గుర్తించారు. సదాశివ డ్వాక్రా గ్రూపు ఖాతా నుంచి రూ.2,40,180 యూపీఐ ద్వారా మోసం జరిగినట్టు వెల్లడైంది. దీంతో గ్రూపు అధ్యక్ష, కార్యదర్శులు కొట్టేటి పార్వతి, చింతల నాగమణి, ఇతర సభ్యులు ప్రత్తిపాడు వెలుగు ఏపీఎం వై.వెంకట్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు ఏపీఎం వెంకట్ తెలిపారు.

బకాయిలు చెల్లిస్తే.. రైతులకు ఉచిత విద్యుత్

ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ రాజబాబు

అంబాజీపేట: నిబంధనలు పాటించని రైతులు ఉచిత విద్యుత్ సౌకర్యం పొందేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొత్తం బకాయిలు చెల్లించాలని ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ (ఆపరేషన్స్) ఎస్.రాజబాబు తెలిపారు. గురువారం స్థానిక సబ్‌స్టేషన్‌లో ఏపీ రెగ్యులేటరీ కమిషన్ రాష్ట్ర సలహా సభ్యుడు ముత్యాల జమీల్ అధ్యక్షతన రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, అంబాజీపేట మండలంలో 275 మంది రైతులు 2011లో డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్ (డీఎస్ఎం) నిబంధనలు పాటించకపోవడంతో ఉచిత విద్యుత్ సౌకర్యం పొందలేకపోయారన్నారు. ఇప్పటికైనా రైతులు ప్రభుత్వానికి బకాయిపడ్డ మొత్తాలను చెల్లించి, డీఎస్ఎం నిబంధనలు పాటిస్తే ఉచిత విద్యుత్ పొందగలరన్నారు. కోనసీమ జిల్లాలోని 71 వేల ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించామని ఎస్ఈ చెప్పారు. సంస్థ డివిజనల్ ఇంజినీర్(ఆపరేషన్స్) కె.రాంబాబు, ఈఈ జి.అన్నవరం, ఏఈ పల్లి కవిత, జేఈ కాకర మోహనరావు, రైతులు పాల్గొన్నారు.

ములికిపల్లి సర్పంచ్‌పై విచారణ



ములికిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద విచారణ నిర్వహిస్తున్న అధికారులు

రాజోలు: అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ములికిపల్లి పంచాయతీ సర్పంచ్ గుబ్బల లక్ష్మీనీలిమ, ఆమె భర్త గుబ్బల రాజుపై పాలకవర్గ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం విచారణ జరిగింది. సర్పంచ్, ఆమె భర్త ఏకపక్ష నిర్ణయాలతో, తీర్మానాలు లేకుండా సుమారు రూ.3.28 లక్షల నిధులు దుర్వినియోగం చేశారని, పంచాయతీ పాత భవనం తొలగించడానికి బహిరంగ వేలం నిర్వహించకుండా, భవనం తొలగించి నిధులు పంచాయతీకి జమ చేయలేదని, పంచాయతీ చెరువులో వేలం వేయకుండా చేపలను విక్రయించారని, తమకు ఓటు వేయలేదనే అక్కసుతో మామిడిశెట్టి వారి గ్రూపులో జల్‌జీవన్ మిషన్‌లో తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారని 12 అంశాలను ఫిర్యాదులో పేర్కొన్నారు. వార్డు సభ్యులు కె.శ్రీనివాస్, వైఎస్‌కే చైతన్య ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, డీపీఓను కోరారు. డీపీఓ ఆదేశాల మేరకు సఖినేటిపల్లి ఈఓపీఆర్డీ కె.సూర్యనారాయణ, లక్కవరం పంచాయతీ కార్యదర్శి అబ్బాస్ ఆలీ ఈ విచారణ నిర్వహించారు. ములికిపల్లి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. 2021 నుంచి ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్, ఆమె భర్త ఆగడాలు భరించలేక వెళ్లిపోయారని విచారణాధికారులకు వివరించారు. రూ.7.45 లక్షలతో పారిశుధ్య సామగ్రి కొనుగోలు చేసినట్టు తప్పుడు రికార్డులు చూపించారని, పంచాయతీ ఫర్నిచర్‌ను సర్పంచ్ ఇంటికి తీసుకెళ్లిపోయారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు సోమిశెట్టి ధనలక్ష్మిని పంచాయతీ సమావేశాలకు ఆహ్వానించిన పంచాయతీ కార్యదర్శి ఓగూరి విజయభానుపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఎంపీటీసీ సభ్యురాలిని పంచాయతీ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోవాలని సర్పంచ్, ఆమె భర్త ఘర్షణ వాతావరణం సృష్టించారని అధికారులకు వివరించారు. ఈ విచారణ నివేదికను డీపీఓకు అందజేస్తామని ఈఓపీఆర్డీ సూర్యనారాయణ తెలిపారు.

కేఎంసీ రాజకీయ సేవ!



సర్పవరం జంక్షన్ వద్ద స్వాగత ద్వారాల ఏర్పాటులో కేఎంసీ క్రేన్లు

- సర్పవరం జంక్షన్ వద్ద జనసేన స్వాగత ద్వారాల నిర్మాణంలో క్రేన్లు
- నిర్ఘాంతపోయిన ప్రజలు

కాకినాడ రూరల్: నవ్వి పోదురు నాకేంటి అన్నట్టుగా ఉంది కూటమి పాలకుల తీరు. పిఠాపురం సమీపం చిత్రాడలో శుక్రవారం జరగనున్న జనసేన ప్లీనరీ కోసం కాకినాడను ఆ పార్టీ స్వాగత ద్వారాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో ముంచెత్తారు. సర్పవరం జంక్షన్ కూడలి వద్ద నాలుగు వైపులా భారీ స్వాగత ద్వారాలను గురువారం ఏర్పాటు చేశారు. ఇందుకు ఉదయం నుంచి రాత్రి వరకు కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)కి చెందిన ప్రజాధనంతో పనిచేసే రెండు భారీ క్రేన్లను వినియోగించారు. వీధి దీపాల ఏర్పాటుకు వాడే వీటిని జనసేన స్వాగత ద్వారాల కోసం వినియోగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. పార్టీ కార్యక్రమాలకు కేఎంసీ క్రేన్ల వినియోగంపై సర్పవరం జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించిన పలువురు నిర్ఘాంతపోయారు. అధికార కూటమి పార్టీ కావడంతో కార్పొరేషన్ అధికారులు నిబంధనలకు పాతర వేశారని పలువురు విమర్శలు గుప్పించారు.

రోడ్డు ప్రమాదంలో నాయనమ్మ, మనవడి మృతి

- ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న బైక్
- దుద్దుకూరు వద్ద ఘటన



సంఘటన స్థలంలో లారీ, మోటార్ బైక్



షేక్ మీరా తున్నీషా(ఫైల్)



షేక్ సమీర్(ఫైల్)

దేవరపల్లి: ముందు వెళుతున్న లారీని మోటార్ బైక్ ఢీకొన్న ప్రమాదంలో నాయనమ్మ, మనవడు మృతి చెందిన విషాద సంఘటన ఇది. మండలంలోని దుద్దుకూరు వద్ద గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారిపై గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, గోపాలపురానికి చెందిన షేక్ మీరా తున్నీషా(65) కుమార్తె ఇటీవల పంగిడి సమీపంలోని గోవర్ధనగిరి మెట్టలో మరణించింది. కీడు దుస్తులు కట్టుకోవడానికి తున్నీషా తమ్ముడు గోవర్ధనగిరి మెట్ట పిలిచాడు. దీంతో తున్నీషా, తన మనవడు షేక్ సమీర్(20) గురువారం ఉదయం మోటార్ బైక్‌పై గోవర్ధనగిరిమెట్టకు వెళ్లారు. దుస్తులు ధరించి, తిరిగొస్తుండగా దుద్దుకూరు వద్ద హైవేపై ముందున్న లారీని మోటార్ బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నాయనమ్మ, మనవడికి తీవ్ర గాయాలు కాగా, హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రులకు తరలించారు. వారు చికిత్స పొందుతూ కొవ్వూరు ప్రభుత్వాస్పత్రిలో నాయనమ్మ, రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో సమీర్ మృతి చెందారు. కాగా షేక్ సమీర్ గోపాలపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ సెకండియర్ చదువుతున్నాడు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు రాస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడు శుక్రవారం పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆత్మ రక్షణపై విద్యార్థినులకు శిక్షణ

అమలాపురం టౌన్: రాష్ట్ర సమగ్ర శిక్ష పథక సంచాలకుల ఆదేశాలతో జిల్లాలోని 239 ఉన్నత పాఠశాలలు, 69 ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు ఆత్మ రక్షణ, ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎంఏకే భీమారావు తెలిపారు. గురువారం రాత్రి ఆయన ఇక్కడ ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 308 పాఠశాలల్లో రూపేష్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షణ ప్రశిక్షణ పేరుతో ఈ శిక్షణా తరగతులు జరుగుతున్నాయన్నారు. పాఠశాలల్లో బాలికలకు కరాటే వంటి ఆత్మ రక్షణ విద్యలను నేర్పుతున్నారని తెలిపారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులు చదువుతో పాటు, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆనంద డోలిక.. హోలీ వేడుక

- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యానికి మేలు
- రసాయన రంగులకు దూరంగా ఉండాలి
- జాగత్తలు పాటించకపోతే కళ్లకు ముప్పే..
- సంబరాలకు సిద్ధమైన పిల్లలు, పెద్దలు
- నేడే వసంతోత్సవం



పందలపాకలో హోలీ ఆడుతున్న చిన్నారులు, యువతులు

బిక్కవోలు: ఫాల్గుణ మాసం పౌర్ణమి. లేలేత చిగుళ్లు, విరబూసిన పూరెమ్మలు, చెట్లు వసంత రాగం ఆలపిస్తున్న తరుణంలో, చిన్నాపెద్దా తేడా లేకుండా, ఆనందోత్సాహలతో జరుపుకొనే పండగ హోలీ. పురాణ ప్రాశస్త్యం కలిగిన ఈ పండగను.. ముఖ్యంగా ఉత్తర భారతీయులు ఎంతో సంబరంగా చేసుకుంటారు. ఇప్పుడు అన్ని ప్రాంతాల్లోనూ ఆనందోత్సాహాలతో ఈ సంబరాల్లో మునిగితేలుతున్నారు. పిల్లా, పెద్దా తేడా లేకుండా, రంగులు పులుముకొంటూ ఆనంద డోలికల్లో విహరిస్తున్నారు. శుక్రవారం హోలీ పండగ సందర్భంగా..

పురాణ కథ

హోలీ పండగ వెనుక ఓ పురాణ కథ ఉంది. హోలీ అనే రాక్షసి పసిపిల్లల ప్రాణాలు హరిస్తూ కడుపు నింపుకొనేది. పిల్లల తల్లిదండ్రులు గర్భశోకంతో ఆగ్రహించి మూకుమ్మడిగా ఆ రాక్షసిని అంతమొందించారు. దాని మరణాన్ని వేడుకగా భావిస్తూ హోలీ పండగ నిర్వహిస్తారనేది కథనం.


ఆనందంతో పాటు ఆరోగ్యం

ఒకప్పుడు పూలు, పండ్ల ద్వారా వచ్చిన రంగులనే వేడుకల్లో వాడేవారు. పండగకు ఒకరోజు ముందు అడవికి వెళ్లి మోదుగు పూలు సేకరించేవారు. వాటిని ఉడికించగా వచ్చిన ఎర్రటి ద్రావణంలో పసుపు, కుంకుమ కలిపి, ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సంబరాలు జరుపుకొనేవారు. కాలక్రమంలో ఆ రంగులు పోయి, వార్నిష్, సింథటిక్ రంగులను చల్లుకోవడం ఆరంభించారు. అవి ప్రమాదకరమని తెలిసినా.. వాడుతూనే ఉండడం ఆందోళన కలిగించే విషయం. హోలీ ఆడటంలో జాగ్రత్తలు తీసుకోక తప్పదని చర్మ వ్యాధుల నిపుణులు హెచ్చరిస్తున్నారు. రసాయన రంగులను కాకుండా, సహజసిద్ధ రంగులతో హోలీ జరుపుకోవడం ద్వారా చర్మానికి హాని జరగకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

ఈ సూచనలు పాటిస్తే మేలు

- పూర్వం ప్రకృతిలో దొరికే మొక్కలు, పూలతో తయారు చేసిన రంగులు చల్లుకోవడంతో చర్మ వ్యాధులు దరిచేరేవి కావు.
- రసాయన రంగులైన లెడ్ ఆక్సైడ్, అల్యూమినియం, బ్రోమైడ్, మెర్క్యురీ సల్ఫేట్ వంటివి వినియోగించడం ఆందోళన కలిగించే విషయం. అవి కళ్లల్లో పడితే కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉంది.
- గులాల్ వంటివి వినియోగిస్తుండడం ప్రమాదకరమే. గులాల్ వంటి రంగులతో ఆస్తమా, చర్మ సంబంధ వ్యాధులు వస్తాయి.
- రసాయనాలు కలసిన రంగులతో హోలీ ఆడితే కనుక వాటిని శరీరంపై ఎక్కువ సమయం ఉండనీయరాదు. వెంటనే చల్లని నీటితో శరీరాన్ని శుభ్రం చేయాలి.
- ఎరుపు, గులాబీ రంగులనే హోలీ కోసం వాడాలి. ఇవి తక్కువ గాఢత కలిగి ఉండటం వల్ల శరరంపై నుంచి సులభంగా తొలగిపోతాయి. గ్రీన్, ఎల్లో, ఆరంజ్ రంగులు ఎక్కువ రసాయనాలను కలిగి ఉన్న కారణంగా సులభంగా తొలగిపోవు.
- హోలీ ఆడటానికి ముందు శరీరానికి మాయిశ్చరైజర్‌ని, తలకు నూనెను రాసుకోవాలి. దీనివల్ల రంగులు శరీరంలోకి ఇంకవు. రంగులను శుభ్రం చేయడం కూడా సులువవుతుంది.
- ముఖంపై పడిన రంగులను శుభ్రం చేసుకోవడానికి సబ్బు కన్నా, క్లీన్సింగ్ మిల్క్ ఉత్తమమైనది.
- చాలా మంది రంగుల్లో వివిధ ఆయిల్స్‌ను కలుపుతారు. ఈ కారణంగా రంగులను శుభ్రం చేయడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది. అందుకే రంగుల్లో ఆయిల్స్ లేదా నీటిని కలపకుండా హోలీ ఆడితే నీటి వృథాను అరికట్టవచ్చు.

చిన్న పిల్లలను దూరంగా ఉంచండి



చాలా మంది సరదా కోసం హోలీ పండగలో చిన్న పిల్లలు కూడా ఉండేలా చేస్తారు. కానీ చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి. రంగులు వారిపై పడితే కంటి సమస్యలు, చర్మ వ్యాధులు, రంగులు నోట్లోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. కనుక వారిని జాగ్రత్తగా చూడాలి.

– పులగం రామానందసాగర్, వైద్యుడు, అనపర్తి

కారు ఢీకొని హమాలీ మృతి

ఐ.పోలవరం: మండలంలోని 216 జాతీయ రహదారిపై కొమరగిరి వద్ద గురువారం రాత్రి మోటార్ బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు, ముమ్మిడివరం మట్టాడిపాలేనికి చెందిన వంటపాటి వీరేంద్ర(32) యానాంలో హమాలీగా పనిచేస్తున్నాడు. పని ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై తిరిగి ముమ్మిడివరంలోని స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో అమలాపురం నుంచి కాకినాడ వెళుతున్న కారు అతడి బైక్‌ను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వీరేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై మల్లికార్జునరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో వ్యక్తి గల్లంతు!

బిక్కవోలు: బలభద్రపురం గ్రామానికి చెందిన నాగులపల్లి సత్యనారాయణ(51) అనే వ్యక్తి కాలువలో గల్లంతైనట్లు అతడి కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు, సత్యనారాయణ కూలీ పని చేస్తుంటాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం ఇంటి నుంచి కూలీ పనికి వెళ్లాడు. తిరిగొచ్చే సమయంలో బలభద్రపురంలోని కాటన్ దొర విగ్రహం వద్ద ఉన్న రేవులో స్నానం చేసి ఇంటికి వెళ్లడం అతడికి అలవాటు. గురువారం సాయంత్రం అతడు తిరిగి రాకపోవడంతో బంధువులు గాలింపు చేపట్టారు. రేవు వద్ద అతడి చేతిక్రర, చెప్పులు, ఇతర సామగ్రి కనిపించాయి. దీంతో అతడు స్నానానికి దిగి, కాలువలో గల్లంతై ఉంటాడని అనుమానిస్తున్నారు. అతడి ఆచూకీ కోసం కాలువలో గాలింపు చేపట్టారు. దీనిపై తమకు సమాచారం అందలేదని ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు.